# 21 రోజుల్లోగా అనుమతులు మంజూరు చేయాలి

## కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, జూన్ 25 : టీఎస్ బీ పాస్ కింద ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి ఉన్న లే అవుట్లకు 21 రోజుల్లోగా అనుమతులు మంజూరు చేయాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లోని మినీ సమావేశం మందిరంలో మంగళవారం జిల్లాస్థాయి లే అవుట్ కమిటీ సమావేశంలో సభ్యులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిబంధనల మేరకు లే అవుట్లు ఉన్నాయా.. లేవా అని క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిర్ధారిత సమయంలోగా అనుమతులు ఇవ్వాలన్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల్లో రెండు చొప్పున లే అవుట్ అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. శుక్రవారం తిరిగి సమావేశమయ్యే నాటికి ప్రభుత్వ నిబంధనల మేరకు లే అవుట్‌లో అండర్ డ్రైనేజీ, విద్యుత్, సెప్టిక్ ట్యాంక్, ఇంకుడు గుంత పచ్చదనం, 10 శాతం మార్టిగేజ్ వంటివి పొందుపరిచారా? వాటిని ఏర్పాటు చేస్తున్నారా? పరిశీలించాలన్నారు. ప్రధానంగా రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీ రాజ్, రోడ్లు భవనాలు, మున్సిపాలిటీ, విద్యుత్ శాఖలు తమ పరిధిలో వచ్చే అంశాలను పరిశీలించి వారం రోజుల్లోగా వివరాలను పొందుపరుస్తూ కలెక్టర్ లాగిన్‌కు పంపాలన్నారు. అక్కడ పరిశీలించి తుది లే అవుట్ అనుమతికి మున్సిపల్ కమిషనర్‌కు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డి ఆర్డీవో రంగనాథరావు, మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆర్‌అండ్‌బీ ఈఈ రవిశంకర్, జిల్లా నీటిపారుదల అధికారి నరసింహారావు, విద్యుత్ ఎస్‌ఈ రమేశ్‌బాబు, కలెక్టరేట్ పర్యవేక్షకులు జ్యోతి పాల్గొన్నారు.

# నిజాయితీని చాటుకున్న ఆర్టీసీ కండక్టర్

## బస్సులో మర్చిపోయిన వస్తువులు ప్రయాణికుడికి అందజేత



బాధితుడికి పట్టాపాస్ పుస్తకం, ఐడీ కార్డులను అందజేస్తున్న కండక్టర్ అర్కల సంజీవ్‌రెడ్డి

చందూర్, జూన్ 25: బస్సులో ఓ రైతు మరిచిపోయిన వస్తువులను తిరిగి అతడికి అందించి నిజాయితీ చాటుకున్నాడు చందూర్ మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ అర్కల సంజీవ్. ఇందుకు సంబంధించిన వివరాలు..బోధన్ నుంచి జేబీఎస్ వెళ్లే బస్సులో కండక్టర్ అర్కల సంజీవ్ విధులు నిర్వహిస్తుండగా మార్గమధ్యంలో బాన్సువాడలో నిజాంసాగర్ మండలం సింగీతం గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి అనే రైతు ఎక్కాడు. బాలానగర్ రాగానే బాల్‌రెడ్డి తన వస్తువులను బస్సులోనే మర్చిపోయి దిగిపోయాడు. రైతు కూర్చున్న సీటులో కవర్‌ను గమనించిన కండక్టర్ సంజీవ్ వెంటనే తెరిచి చూడగా అందులో పట్టాపాస్ పుస్తకం, ఐడీ కార్డు, ఆధార్, బ్యాంకు పుస్తకం, పాన్‌కార్డు ఉన్నాయి. దీంతో కండక్టర్ వెంటనే ఐడీ కార్డులో ఉన్న చిరునామా ఆధారంగా సింగీతం గ్రామంలో ఉన్న బంధువుకు ఫోన్‌చేసి సదరు రైతు ఫోన్ నంబర్ తీసుకున్నాడు. కవర్ గురించి అతడికి సమాచారం ఇచ్చి తిరుగు ప్రయాణంలో బాలానగర్‌లో ఆర్టీసీ కంట్రోలర్ శర్నప్ప సమక్షంలో బాల్‌రెడ్డికి అందజేశారు. దీంతో కండక్టర్‌కు రైతు కృతజ్ఞతలు తెలిపాడు.

### స్కూటీ నుంచి
# రూ.రెండు లక్షలు చోరీ

భీమ్‌గల్, జూన్ 25: డబ్బులను బ్యాంక్ నుంచి తీసుకొని స్కూటీలో పెట్టిన కొద్ది సేపటికే దొంగిలించిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకున్నది. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కమ్మర్‌పల్లి మండలం కోనాసముందర్ గ్రామానికి చెందిన కొప్పెర సాంబయ్య మంగళవారం భీమ్‌గల్ మండల కేంద్రంలోని ఎస్‌బీఐ నుంచి తన అవసరాల నిమిత్తం రూ.రెండు లక్షల డబ్బులను విత్ డ్రా చేశాడు. అనంతరం తాను వచ్చిన స్కూటీ డిక్కీలో నగదును పెట్టి పక్కకు వెళ్లాడు. కొద్ది సేపటి తర్వాత వచ్చి చూడగా నగదు కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# రెండోరోజు కొనసాగిన జూనియర్ డాక్టర్ల సమ్మె



జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న జూనియర్ డాక్టర్లు

ఖలీల్‌వాడి, జూన్ 25 : తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ జిల్లా ప్రభుత్వ దవాఖానలో జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మె మంగళవారం రెండోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జూడా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రభుత్వ దవాఖానలో ఎన్నో రకాలుగా నిరుపేదలకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తున్నదని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైద్యులు హరితకృష్ణ, షఫీ తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో వ్యక్తి దారుణ హత్య

వినాయక నగర్, జూన్ 25: నగర శివారులోని ధర్మపురి హిల్స్ పరిధిలో ఉన్న ఓ దర్గా వద్ద ఒకరు దారుణహత్యకు గురయ్యాడు. దర్గా వద్ద 30 ఏండ్లుగా వాచ్‌మన్‌గా పని చేస్తున్న వ్యక్తిని ఆయుధాలతో పొడిచి చంపడం స్థానికులను భయాందోళనకు గురిచేసింది. ఇందుకు సంబంధించిన వివరాలు.. ఆస్మీకాలనీకి చెందిన షేక్‌హసన్ (65) ధర్మపురి హిల్స్ ప్రాంతంలో ఉన్న రంజానీ బాబా దర్గా వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు షేక్ హసన్ ముఖంపై దారుణంగా పొడిచి చంపారు.

మంగళవారం విషయం తెలుసుకున్న సౌత్ రూరల్ సీఐ సురేశ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి స్థానికులను విచారించారు. కత్తులు లేదా గొడ్డలి లాంటి పదునైన ఆయుధంతో దాడిచేసిన ఆనవాళ్లు లభించినట్లు సీఐ తెలిపారు. మృతుడి కుమారుడు ఎజాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరోటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. హత్య డబ్బుల కోసమా లేక ఇతర ఇవైనా కారణాలు ఉన్నాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో పనులు పూర్తి చేయాలి




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, జూన్ 25 : అంగన్‌వాడీ కేంద్రాల్లో సివిల్ వర్క్స్ కోసం మంజూరు చేసిన నిధులను వినియోగించుకోవాలని, ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో తాగునీరు, టాయిలెట్ల నిర్మాణం, విద్యుత్ మరమ్మతు తదితర అభివృద్ధి పనులు పూర్తి చేయాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిపై రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో ఆమె మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమీకృత కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐదు నుంచి ఆరు ఏండ్ల పిల్లల సంక్షేమం కోసం కృషి చేసిన స్వచ్ఛంద సంస్థల సహకారంతో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కార్యాచరణ, పిల్లలకు నేర్పించాల్సిన పాఠ్యాశాలు, పిల్లల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికను రూపొందించామని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని చిన్న వయస్సు పిల్లలకు నేర్పాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత, నైపుణ్యాలతో కోర్సు సిద్ధం చేశామని తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ప్లే మ్యాట్ ఏర్పాటు చేయాలని సూచించారు. జూలై నెలలో అంగన్‌వాడీ పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. పోషక లోపం ఉన్న పిల్లలను అంగన్‌వాడీ టీచర్ల ద్వారా గుర్తించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో 1 నుంచి 6 ఏండ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో రిజిస్టర్ చేయించి వారికి రెగ్యులర్‌గా పౌష్టికాహారం అందించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి బావయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సివిల్స్ లాంగ్ టర్మ్ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి, జూన్ 25: సివిల్స్‌కు ఉచిత లాంగ్ టర్మ్ కోచింగ్ కోసం నిరుద్యోగ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 3 వరకు www.tgbcstudycircle.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూలై 7న ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు భోజనం, రవాణా కోసం రూ. 5వేలు, పుస్తకాల కోసం రూ. 5వేలు ఇస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 08462-241055 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

**గ్రూప్-2 కోసం గ్రాండ్ టెస్టులు**

గ్రూప్-2 రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూలై 8వ తేదీన ప్రతి పేపరుకు నాలుగు గ్రాండ్ టెస్టులు నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాండ్ టెస్ట్‌లకు హాజరుకావాల్సిన అభ్యర్థులు www.tgbcstudycircle.cgg.gov.in ద్వారా ఆన్‌లైన్ ద్వారా జూలై 5వరకు సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు 08462-241055 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# విద్యా సంస్థలపై దాడి చేస్తే క్రిమినల్ కేసులు

వినాయకనగర్, జూన్ 25: జిల్లాలోని విద్యా సంస్థలపై దాడులు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీపీ కల్మేశ్వర్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయ న మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని విద్యార్థి సంఘాలు ఇటీవల కొన్ని ప్రైవేటు స్కూల్స్, కళాశాలలకు చెందిన క్యాపస్‌లోకి ప్రవేశించి యాజమాన్యాల తో గొడవకు దిగి వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. విద్యార్థి నాయకులు, విద్యార్థి సంఘాలకు విద్య సంబంధిత ఏవైనా సమస్యలు ఉంటే ముందుగా జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి లేదా జిల్లా పరిపాలన అధికారి దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. సమస్య పరిష్కారానికి సామరస్యంగా కృషి చేయాలని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి దాడులు చేసినా, బంద్‌చేయించినా యాజమాన్యాలను భయభ్రాంతులకు గురి చేసినా వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని స్పష్టం చేశారు.

# ఒకటిలోగా రీవాల్యుయేషన్ ఫీజు చెల్లించాలి

డిచ్‌పల్లి, జూన్ 25 : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని 1వ, 3వ, 5వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు రీవాల్యుయేషన్ తేదీని ప్రకటించారు. ఈ మేరకు టీయూ పరీక్షల విభాగం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. జూలై ఒకటో తేదీలోగా రీవాల్యుయేషన్ కోరిన విద్యార్థులు ఫీజు చెల్లించాలని సూచించారు. ఒక్కో పేపర్‌కు ఫీజు రూ.500 చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారిణి ఆచార్య అరుణ తెలిపారు.

## వాణిజ్యం

### తొలిరోజు 11 వేల కోట్ల స్పెక్ట్రం వేలం

న్యూఢిల్లీ, జూన్ 25: స్పెక్ట్రం వేలానికి టెలికం సంస్థల నుంచి అనూహ్య స్పందన లభించింది. తొలిరోజు నిర్వహించిన ఐదు రౌండ్లలో రూ.11 వేల కోట్ల విలువైన వాయుతరంగాలకు బిడ్లు దాఖలయ్యాయని తెలుస్తున్నది. ఈసారి నిర్వహిస్తున్న 10,500 మెగాహెట్జ్ స్పెక్ట్రం వేలం ద్వారా రూ.96,238 కోట్ల నిధులు సమకూరవచ్చునని కేంద్రం అంచనావేసింది. ఈ వేలం రెండోరోజు బుధవారం కూడా కొనసాగనున్నది. తొలి రోజు నిర్వహించిన 900, 1800 మెగాహెట్జ్ బాండ్స్ వేలంలో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు పాల్గొన్నాయి.

### ఐపీవోకి మారుతి ఇస్పాత్

హైదరాబాద్, జూన్ 25: దక్షిణాదిలో రెండో అతిపెద్ద స్టీల్ తయారీ సంస్థ మారుతి ఇస్పాత్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఎంఐపీపీఎల్)...నూతన బ్రాండ్ 'ఎంఎస్ వాయు'ను మార్కెట్‌కు పరిచయం చేసింది. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో అభిశేక్ అగర్వాల్ మాట్లాడుతూ..వ్యాపారాన్ని దేశవ్యాప్తంగా విస్తరించడానికి వచ్చే ఐదేండ్లలో రూ.2 వేల కోట్ల స్థాయిలో పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతానికి దక్షిణాదితోపాటు పడమర భారతంలో తన ఉత్పత్తులను విక్రయిస్తున్న సంస్థ..వచ్చే ఐదేండ్లలో ఉత్తర, తూర్పు భారతానికి విస్తరించనున్నట్లు, ఇందు కోసం కొత్తగా స్టీల్ తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం వచ్చే రెండేండ్లలో ఐపీవోకి రాబోతున్నట్టు చెప్పారు.

### సిద్స్ ఫార్మ్ 83 కోట్ల సేకరణ

హైదరాబాద్, జూన్ 25: డెయిరీ స్టార్టప్ సిద్స్ ఫార్మ్..వ్యాపార విస్తరణ కోసం అవసరమయ్యే నిధుల్లో 10 మిలియన్ డాలర్ల(రూ.83 కోట్లు)ను పెట్టుబడిదారుల నుంచి సేకరించింది. ఈ నిధులతో హైదరాబాద్‌తోపాటు బెంగళూరులలో ఉన్న పాల ఉత్పత్తుల కేంద్రాల సామర్థ్యాన్ని పెంచడానికి వినియోగించనున్నట్లు కంపెనీ ఫౌండర్ కిశోర్ ఇందుకూరి తెలిపారు. అధిక నాణ్యత పాల ఉత్పత్తులకు పెరగనున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. 2016లో హైదరాబాద్ కేంద్రంగా పాల ఉత్పత్తుల సేవలను ఆరంభించిన సంస్థకు ప్రస్తుతం ఈ రెండు నగరాల్లో 25 వేల మంది కస్టమర్లు ఉన్నారు.

# జోషెత్తిన మార్కెట్లు



## ఆల్‌టైమ్ హైల్లో సూచీలు

- క్యూ4లో కలిసొచ్చిన కరెంట్ ఖాతా మిగులు
- 712 పాయింట్లు ఎగిసి తొలిసారి 78వేలపైకి సెన్సెక్స్
- 183 పాయింట్లు పెరిగి 23,721 స్థాయికి నిఫ్టీ
- మదుపరులను ఆకట్టుకున్న బ్యాంకింగ్, ఐటీ షేర్లు


ముంబై, జూన్ 25: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ లాభాలను అందుకున్నాయి. ఈ క్రమంలోనే ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడ్డాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ తొలిసారి 78వేల మార్కును దాటింది. 712.44 పాయింట్లు లేదా 0.92 శాతం ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా 78,053.52 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 823.63 పాయింట్లు అందిపుచ్చుకొని 78,164.71 స్థాయిని తాకింది. తద్వారా ఇంట్రా-డే హై రికార్డును నెలకొల్పింది. ఈ నెల 10న సెన్సెక్స్ మొదటిసారి 77వేల మార్కును అందుకున్న విషయం తెలిసిందే. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 183.45 పాయింట్లు లేదా 0.78 శాతం ఎగిసి గతంలో ఎన్నడూ లేనివిధంగా 23,721.30 వద్ద ముగిసింది. ఇంట్రా-డేలోనూ సరికొత్త స్థాయిని చేరింది. 216.3 పాయింట్లు పెరిగి 23,754.15 వద్దకు వెళ్లింది.

**బ్లూచిప్ ఉత్సాహం**

ఇతర ఆసియా దేశాల మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాల నడుమ మొదలైన దేశీయ స్టాక్ మార్కెట్లకు బ్లూచిప్ కంపెనీలు దన్నుగా నిలిచాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, ఎస్బీఐ, ఎల్‌అండ్‌టీ, బజాజ్ ఫిన్‌సర్వ్ తదితర బడా సంస్థల షేర్ల కొనుగోళ్లకు మదుపరులు పోటీపడ్డారు. దీంతో సెన్సెక్స్ పరుగులు పెట్టింది. ఈ క్రమంలోనే ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ 100 బిలియన్ డాలర్ల మార్కును తాకింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్‌ల తర్వాత ఈ ఘనత సాధించిన ఆరో సంస్థగా నిలిచింది. బీఎస్ఈలో 2.48 శాతం పెరిగి రూ.1,199.05 వద్ద ఐసీఐసీఐ బ్యాంక్ షేర్ విలువ ఉన్నది. ఎన్ఎస్ఈలో 2.90 శాతం వృద్ధితో రూ.1,204గా ఉన్నది. ఇక బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలూ 0.26 శాతం, 0.03 శాతం చొప్పున పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్ల విషయానికొస్తే.. ఆసియా దేశాల్లో దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు లాభాల్లో ఉన్నాయి. చైనా నష్టపోయింది. ఐరోపా మార్కెట్లలో ప్రధాన సూచీలు నష్టాల్లోనే కదలాడుతున్నాయి.

**రంగాలవారీగా..**

బ్యాంకింగ్ రంగ షేర్లు గరిష్ఠంగా 1.87 శాతం మేర పెరిగాయి. అలాగే ఆర్థిక సేవలు 1.45 శాతం, ఐటీ 0.53 శాతం, క్యాపిటల్ గూడ్స్ 0.28 శాతం, టెక్నాలజీ 0.43 శాతం చొప్పున బలపడ్డాయి. కానీ రియల్టీ, పవర్, యుటిలిటీస్, మెటల్, టెలికం షేర్లు 1.82 శాతం నుంచి 0.28 శాతం వరకు నష్టపోయాయి. కాగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వివరాల ప్రకారం ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో కరెంట్ ఖాతా మిగులు 5.7 బిలియన్ డాలర్లుగా నమోదైంది. దేశ జీడీపీలో ఇది 0.6 శాతానికి సమానం. ఇది సహజంగానే స్టాక్ మార్కెట్లకు ఉత్సాహాన్నిచ్చిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. రూపాయిపై ఒత్తిళ్లను తగ్గించిందని, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులకూ మార్గాన్ని సుగమం చేసిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రధాన పెట్టుబడుల వ్యూహకర్త వీకే విజయకుమార్ అన్నారు. వడ్డీరేట్ల కోతలపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ నుంచి స్పష్టత రాబోతున్నదన్న సంకేతాలూ కలిసొచ్చాయని ఆయన తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు.



### అమర రాజా దూకుడు

తెలుగు రాష్ట్రాలకు చెందిన అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ కంపెనీ షేర్ల విలువ ఈ ఒక్కరోజే 19 శాతానికిపైగా పెరిగింది. సంస్థకు అనుబంధంగా ఉన్న అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్.. లిథియం-ఐయాన్ సెల్స్ టెక్నాలజీ కోసం జీఐబీ ఎనర్జీఎక్స్‌తో చేసుకున్న లైసెన్సింగ్ ఒప్పందం.. మదుపరుల్లో జోష్‌ను పెంచింది. షేర్ల కొనుగోళ్లకు పోటెత్తారు. దీంతో బీఎస్ఈలో 19.40 శాతం వృద్ధితో రూ.1,647 వద్ద షేర్ విలువ ముగిసింది. ఒకానొక దశలో 52 వారాల గరిష్ఠాన్ని తాకుతూ 19.99 శాతం ఎగిసి 1,655.20కు చేరింది. ఎన్ఎస్ఈలోనూ 19.56 శాతం లాభపడి రూ.1,650 వద్ద నిలిచింది. ఇంట్రా-డేలో 19.99 శాతం ఎగబాకి 52 వారాల గరిష్ఠాన్ని చేరుతూ 1,656.05 వద్దకు వెళ్లింది.




# బ్యాంకింగ్ సేవలకు స్మార్ట్ లాక్

## వినూత్న సేవలకు ఐసీఐసీఐ బ్యాంక్ శ్రీకారం

న్యూఢిల్లీ, జూన్ 25: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన ఐసీఐసీఐ బ్యాంక్..మరో వినూత్న సేవలకు శ్రీకారం చుట్టింది. బ్యాంకింగ్ సేవలను లాక్ చేసుకోవడంతోపాటు అన్‌లాక్ చేసుకునే సేవలను ప్రారంభించింది. ఇందుకోసం స్మార్ట్‌లాక్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవలతో బ్యాంక్ ఖాతాకు లాక్ లేదా అన్‌లాక్ చేసుకోవచ్చును. అలాగే యూపీఐ, క్రెడిట్, డెబిట్ కార్డులకు సంబంధించి లావాదేవీలను కూడా నిలిపివేసుకోవచ్చును. ఫోన్ లేదా ఈ-మెయిల్ అవసరం లేకుండానే తమ ఖాతాకు సంబంధించిన అన్ని రకాల సేవలను నిలిపివేసుకోవచ్చును. దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఇలాంటి నూతన సేవలు అందుబాటులోకి రావడం ఇదే తొలి సారి. ఈ స్మార్ట్‌లాక్ ద్వారా ఖాతాదారుడు ఐమొబిలీ పే సేవలను నిలిపివేసుకోవచ్చునని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి.

**స్మార్ట్‌లాక్ ఫీచర్స్ ఇవే..**

- ఐమొబిలియో పేలో లాగిన్ కావాలి
- హోమ్ స్క్రీన్ కుడి దిగువ మూలలో స్మార్ట్‌లాక్ ఫీచర్ బటన్‌ను నొక్కాలి.
- దీంతో కీలక బ్యాంకింగ్ సేవలను లాక్/అన్‌లాక్ చేసుకునే వీలుంటుంది.

### తగ్గిన జావా 350 బైకు ధర


న్యూఢిల్లీ, జూన్ 25: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా కీలక నిర్ణయం తీసుకున్నది. తన ప్రీమియం బైకులు జావా మాడళ్ల ధరలను రూ.15 వేల వరకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఈ ఏడాది తొలినాళ్లలో దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన క్లాసిక్ 350, జావా 350 మాడళ్లు రూ.2.14 లక్షల ప్రారంభ ధరతో లభించనున్నాయి. దీంతో జావా 350 బైకు ధర రూ.2,14,950 నుంచి రూ.1,98,950కి దిగొచ్చింది. ఈ బైకు 334 సీసీ సామర్థ్యంతో రూపొందించింది.

### ఎఫ్ఎంసీజీలో 9% వృద్ధి

న్యూఢిల్లీ, జూన్ 25: ఈ ఏడాదిలో ఎఫ్ఎంసీజీ రంగం 7-9 శాతం వృద్ధిని నమోదు చేసుకోనున్నదని ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఎఫ్ఎంసీజీ రంగానికి ప్రభుత్వం అండదండగా ఉండటం, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని పేర్కొంది. అయినప్పటికీ ఈ రంగం పలు సవాళ్లను ఎదుర్కొనున్నదని, ముఖ్యంగా ద్రవ్యోల్బణం ఒత్తిడి, కొనుగోలుదారుల్లో విశ్వాసం కోల్పోవడం, నిరుద్యోగం అధికంగా ఉండటం వంటి సమస్యలు ఎదుర్కొక తప్పదని హెచ్చరించింది.

# ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యం


## వృద్ధిరేటును అధిక వడ్డీరేట్లు అడ్డుకోవు ● ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



ముంబై, జూన్ 25: దేశ జీడీపీ వృద్ధిరేటును అధిక వడ్డీరేట్లు అడ్డుకోబోవని ఆర్బీఐగవర్నర్ శక్తికాంత దాస్ నొక్కిచెప్పారు. మంగళవారం ఇక్కడ బాంబే చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్రవ్యోల్బణం అదుపే ఆర్బీఐ లక్ష్యమని స్పష్టం చేశారు. ధరల నియంత్రణకు తగ్గట్టుగానే ద్రవ్య విధానం ఉంటుందని, ఇందులో ఎలాంటి సందేహాలు అక్కర్లేదని తేల్చిచెప్పారు. దేశ జీడీపీ 8 శాతం దిశగా వెళ్తున్నదన్న దాస్.. వృద్ధిరేటు బాగుంటే, ఆకర్షణీయంగా ఉంటే ఇప్పుడున్న అధిక వడ్డీరేట్ల ప్రభావం లేనట్టేగా అని చెప్పుకొచ్చారు. ఇక ద్రవ్యోల్బణం గణాంకాలపై స్పందిస్తూ.. 2022లో గరిష్ఠంగా 7.8 శాతంగా ఉన్నదని, ఇప్పుడు 3.1 శాతం నుంచి 4.7 శాతం మధ్యకే పరిమితమైందని దాస్ అన్నారు. వర్షాభావ పరిస్థితులు ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తున్నాయని కూడా వ్యాఖ్యానించారు. ధరల అదుపుపైనే ఆర్బీఐ దృష్టి పెట్టడంవల్ల రైతాంగానికి ఇబ్బందులు ఉంటున్నాయన్న వాదనల్ని దాస్ తోసిపుచ్చారు. రైతులూ వినియోగదారులేనన్న ఆయన ద్రవ్యోల్బణం తగ్గితే వారికీ ప్రయోజనమేనన్నారు.

# పరోక్ష పన్నులు తగ్గాలి

## ముందస్తు బడ్జెట్ చర్చల్లో పరిశ్రమ డిమాండ్






న్యూఢిల్లీ, జూన్ 25: పరోక్ష పన్నులను తగ్గించాలని, సుంకాల నిర్మాణాన్ని హేతుబద్ధం చేయాలని వివిధ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు, సంఘాల నాయకులు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. ముందస్తు బడ్జెట్ చర్చల్లో భాగంగా మంగళవారం మంత్రితో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈవో) అధ్యక్షుడు అశ్వినీ కుమార్.. వచ్చే ఐదేండ్లకుగాను ఇంట్రెస్ట్ ఈక్వలైజేషన్ స్కీంను పొడిగించాలని కోరారు. ఈ స్కీం ఈ నెలాఖరుతో ముగుస్తున్నది. అలాగే రాబోయే బడ్జెట్‌లో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకాన్ని పొడిగించాలని దేశీయ తోలు, పాదరక్షల ఎగుమతిదారులు కోరుతున్నారు.

**బంగారం, వెండిపై..**

బంగారం, వెండి, ప్లాటినం కడ్డీలపై దిగుమతి సుంకాన్ని తగ్గించాలని రత్నాలు, ఆభరణాల ఎగుమతిదారుల ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) డిమాండ్ చేస్తున్నది. వచ్చే బడ్జెట్‌లో 4 శాతానికి దించాలని కోరింది. ప్రస్తుతం 15 శాతం పడుతున్నది. ఇక ఎగుమతులు పెరిగేలా ప్రోత్సాహకాలు ఇవ్వాలని, ప్రత్యేక నోటిఫైడ్ జోన్లలో ముడి వజ్రాల అమ్మకాలకూ అనుమతివ్వాలని మండలి విజ్ఞప్తి చేసింది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను వచ్చే నెల పార్లమెంట్‌లో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టనున్నారు.

**ఖాళీలను భర్తీ చేయాలి**

అన్ని కేంద్ర ప్రభుత్వ శాఖల్లో, ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రస్తుతమున్న ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ట్రేడ్ యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ నియామకాలను నిలిపేయాలని కూడా కోరుతున్నాయి. నిధుల సమీకరణ కోసం ప్రధాన ఆహారోత్పత్తులు, ఔషధాలపై జీఎస్టీ ఇతరత్రా పన్నులు, సెస్సుల భారం వేయకుండా.. కార్పొరేట్ ట్యాక్స్, సంపద పన్నులను పెంచాలని, వారసత్వ పన్నును తీసుకురావాలని యూనియన్ నాయకులు సూచిస్తున్నారు. బీఎంఎస్ ప్రత్యేకంగా తమ డిమాండ్లతో ఓ మెమరాండాన్ని సమర్పించింది. ఎంజీఎన్ఆర్ఈజీఏ కింద ప్రతీ కుటుంబానికి ఏటా 200 రోజుల పని కల్పించాలని, వ్యవసాయం, దాని అనుబంధ రంగాల పనులనూ ఈ చట్టం కిందకు తీసుకురావాలని కోరింది. 60 ఏండ్లు దాటినవారందరికీ ఆరోగ్య ప్రయోజనాలను సమకూర్చాలని, నెలకు రూ.100 టోకెన్ అమౌంట్‌తో రూ.5 లక్షల వార్షిక బీమా కవరేజీనివ్వాలన్నది. ఆయుష్మాన్ భారత్ స్కీం పరిమితిని రూ.3 లక్షలకు పెంచాలన్నది.